## ఉద్యమంలో ముందుండి కొట్లాడిన కేటీఆర్..

మియాపూర్ , జనవరి 9 : తెలంగాణ ఉద్యమంలో ముందుండి కొట్లాడిన నిఖార్సయిన నేత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అని వివేకానందనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పేర్కొన్నారు. స్వరాష్ట్రాన్ని సాధించి ఉద్యమ స్ఫూర్తితోనే గులాబీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఎప్పటికీ పోరాడుతున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి బీఆర్ఎస్ శ్రేణులను అణగదొక్కాలన్న ఏకైక లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పూరితంగా పని చేస్తున్నారని, తమ ఉద్యమ నేతలు కేసీఆర్, కేటీఆర్‌ల నేతృత్వంలో రాజీలేని పోరాటాన్ని కొనసాగించి కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం నేర్పుతామని పేర్కొన్నారు. కేటీఆర్‌పై కుట్రపూరితంగా కేసుల నమోదుతో భయపెట్టలేరన్నారు.

## సంక్రాంతికి ప్రత్యేక బస్సు సర్వీసు లు

మియాపూర్ , జనవరి 9 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మియాపూర్ ఆర్‌టీసీ డీపో 2 ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు ఈ నెల 10 నుంచి 17 వరకు ప్రత్యేక బస్సు సర్వీసు సేవలను అందిస్తున్నట్లు డీఎం వెంకటేశం గురువారం తెలిపారు. మియాపూర్ కూడలి నుంచి ఈ బస్సులు కేపీహెచ్‌బీ , కూకట్‌పల్లి, అమీర్‌పేట్, ఎంజీబీఎస్ మీదుగా దూర ప్రాంతాలకు నడపన్నామన్నారు. సంక్రాంతి సేవల్లో విహార యాత్రలకు ప్రత్యేక బస్సులను సైతం అందిస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్: 9959226420, 8008336063 లలో సంప్రదించాలన్నారు. సుఖవంతమైన, సురక్షితమైన ప్రయాణానికి ఆర్‌టీసీ బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

# వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

### జేఎన్‌టీయూహెచ్‌లో విద్యార్థుల ఆందోళన



జేఎన్‌టీయూహెచ్‌లో వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నేతలు, విద్యార్థులు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 9 : జేఎన్‌టీయూహెచ్ వసతిగృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. గురువారం వర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘం నేతలతో కలిసి విద్యార్థులు జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో వర్సిటీ పరిపాలన భవనం ఎదుట బైటాయించి ఆందోళన చేపట్టారు. వర్సిటీలోని ఆర్ఎస్‌క్యూ1 రీసెర్చ్ స్కాలర్స్ క్వార్టర్స్‌ను బాలుర వసతి గృహంగా మార్చాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి వసతి గృహ సదుపాయా న్ని కల్పించాలని కోరారు. వసతి గృహాల్లో అనధికారిక వ్యక్తులను బయటికి పంపించాలని, ఇందులో విద్యార్థులు నివసించలేని పరిస్థితు లు ఉన్నాయని, పైన ఫ్లోర్‌లో మూత్ర విసర్జన చేస్తే, కింది ఫ్లోర్‌లో లీకేజీ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాల వెనుక డ్రైనే జీ లీకేజీ సమస్యలు ఉన్నాయని, దీంతో దుర్వాసన వస్తుందన్నారు. దోమల బెడదతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందన్నారు. వందలాది మంది విద్యార్థులు మంచి ర్యాంకు లు సాధించి, చదువుకోవడానికి వర్సిటీకి వస్తే..వసతి గృహాల్లో చోటు లేక...బయట హాస్టల్స్‌లో ఉంటున్నారన్నారు. విద్యార్థులపై అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశా రు. బీటెక్ ఐడీపీ కోర్సుల ఫీజులను రూ.50వేలకు తగ్గించి..ఆ ఫీజులను ప్రభుత్వమే విడుదల చేసేలా వర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీ పరిసరాలను శుభ్రంగా మార్చడంలో విఫలమవుతున్నా..ఏజెన్సీలను తొలగించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో జీహెచ్ఎంసీ సహాయంతో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వర్సిటీలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో రెక్టార్ విజయ్ కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... వసతి గృహాల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీనివ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించా రు.

ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు రాహుల్‌నాయక్, శివకృష్ణ, రోహిత్‌కుమార్, అరవింద్‌కుమార్, సిద్ధార్థ్, బ్రహ్మం గౌడ్, సాయికుమార్‌రాథోడ్, విశ్వతేజ, కిరణ్, శ్రీనివాస్,సాగర్, ధనుంజయ, అంజి, చైతన్య, ఆనంద్, హేమంత్, ప్రసన్న, వర్ణ, సుష్మిత, వేద, గాయత్రి, షర్మిల, జివ్వాది దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



## అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

మాదాపూర్‌లోని శిల్పారామంలో ప్రారంభమైన గాంధీ శిల్ప బజార్, సంక్రాంతి సంబురాల్లో భాగంగా ఏర్పాటు చేసిన హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మట్టి బొమ్మలు, గుజరాతి పాత్రలు, కొండపల్లి బొమ్మలు, గుజరాతి బ్యాగులు, పాలరాయి బొమ్మలు, వెదురు బుట్టలు, పెయింటింగ్స్, తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనల్లో మేఘన శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు. పుష్పాంజలి, వినాయక కౌతం, అన్నమాచార్య కీర్తన, దశావతారం, తదితర అంశాలను ప్రదర్శించారు. *– కొండాపూర్, జనవరి 9*

## వ్యవసాయ సహకార బ్యాంకు ఏర్పాటు చేయాలి



డీసీవోకు వినతి పత్రం అందజేస్తున్న దుండిగల్ పురప్రముఖులు

దుండిగల్, జనవరి 9 : గండిమైసమ్మ-దుండిగల్ మండలం, దుండిగల్ గ్రామంలో నూతనంగా వ్యవసాయ సహకార బ్యాంకు( పీఏసీఎస్) బ్రాంచిని ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం పలువురు పురప్రముఖులు మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌తో పాటు డీసీఓలకు వినతి పత్రం అందజేశారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అధికారులకు వినతి పత్రం అందజేసిన వారిలో చినంగి వెంకటేశం ముదిరాజ్, అమరం గోపాల్‌రెడ్డి, జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల శ్రీనివాస్, డి.ఆనంద్, రవీందర్ యాదవ్, నల్తూరి కృష్ణ, అశోక్ ముదిరాజ్, బండారి మహేశ్, ఆకుల ప్రేమ్‌పటేల్, శ్రీనివాస్‌గౌడ్, పాండుగౌడ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## ఎన్‌టీఆర్‌నగర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ఎన్‌టీఆర్ నగర్ కాలనీలో సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బాచుపల్లి సీఐ ఉపేందర్‌రావులు హాజరై చక్కటి ముగ్గులు వేసిన మహిళలను అభినందిస్తూ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ప్రణయ, సీనియర్ నాయకులు ఆవుల జగన్‌యాదవ్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు కడ్తాల్ పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తాతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు. *– దుండిగల్, జనవరి 9*

## భద్రంగా వాహనాలు నడిపి..సురక్షితంగా చేరాలి



మేడ్చల్ ఓఆర్ఓర్‌పై రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మేడ్చల్ రవాణాశాఖ అధికారులు

కుత్బుల్లాపూర్, జనవరి 9 : భద్రంగా వాహనాలు నడిపి..సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి రఘునందన్‌గౌడ్ కోరారు. రోడ్డు భద్రత జాతీయ వారోత్సవాల సందర్భంగా భారీ, చిన్నతరహా వాహనచోదకులకు రోడ్డు భద్రత, రిఫ్లెక్ట్ టేపు ప్రాముఖ్యతపై కొంపల్లి జాతీయ రహదారి ఓఆర్ఆర్ టోల్‌గేట్ వద్ద భద్రతప్రమాదాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని, ఎమర్జెన్సీ వాహనాలకు దారివదులుతూ వేగపరిమితి మించకుండా భద్రంగా వాహనాలను నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోటర్ వాహన తనిఖీ అధికారులు సాదుల శ్రీనివాస్, శిల్ప, సహాయ వాహన తనిఖీ అధికారి త్రివేణిబాయితో పాటు రవాణా సిబ్బంది, కానిస్టేబుల్స్, హోంగార్డులు పాల్గొన్నారు.

## ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా వనజ అశోక్



దుండిగల్, జనవరి 9: తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా జగద్గిరిగుట్టలోని అశోక్ మెమోరియల్ చాణక్య విద్యా సంస్థల కరస్పాండెంట్ అల్వాల వనజ అశోక్ నియమితులయ్యారు. బహదూర్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన ట్రస్మా రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో వనజ పేరును ప్రకటించి రాష్ట్ర కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వనజ అశోక్ మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## రాజరాజేశ్వరినగర్ కాలనీ సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

బాలానగర్, జనవరి 9 : రాజరాజేశ్వరినగర్ కాలనీ సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరినగర్‌కాలనీ రోడ్ నంబర్ 6లో జీహెచ్ఎంసీ ఏఈ ఆశతో కలిసి ఆయన పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించడానికి ప్రత్యేక కార్యచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, చలపతి, చక్రధర్, మురళీధర్‌గౌడ్, రఘునాథ్, శ్రీనివాస్, మల్లేశ్ యాదవ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరినగర్‌కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్

## సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి



కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ప్రేమ్‌కుమార్

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 9 : సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లో ఝాన్సీ రాణి లక్ష్మీబాయ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలను ప్రారంభించి... విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంక్రాంతి పండుగ అంటేనే ... రంగురంగుల ముగ్గులు, పంతంగులు, గొబ్బెమ్మలు కనిపిస్తానయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎం.వరలక్ష్మి, ఎన్.సులక్షణ, జనసేన నేతలు కొల్లా శంకర్, కలిగినిడి ప్రసాద్, అడబాల షణ్ముక, పోలబోయిన శ్రీనివాస్, పాదం సూర్య, పులగం సుబ్బులు, సర్విగారి ప్రీతంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి డిపోలో భద్రత మాసోత్సవాలు



బాలానగర్, జనవరి 9 : కూకట్‌పల్లి డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం నిర్వహించిన మాసోత్సవాలకు అడిషనల్ డీజీపీ వీరన్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్ కవిత రూపాల, డిపో మేనేజర్ డి. హరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరీ, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో గ్రేట్ బాంబే సర్కస్




సిటీబ్యూరో, జనవరి 9(నమస్తే తెలంగాణ): ప్రపంచప్రసిద్ధిగాంచిన గ్రేట్ బాంబే సర్కస్ ప్రస్తుతం కుత్బుల్లాపూర్‌లోని చింతల్ మున్సిపల్ ఆఫీస్ పక్కన ఉన్న హెచ్ఎంటీ గ్రౌండ్‌లో జరుగుతున్నదని నిర్వాహకులు తెలిపారు. ప్రతీరోజు మూడుషోలు.. మధ్యాహ్నం ఒంటిగంటకు, సాయంత్రం నాలుగుగంటలకు, రాత్రి ఏడు గంటలకు ఉంటాయని, సెలవురోజుల్లో ప్రత్యేకషోలు ఉంటాయని వారు తెలిపారు. తాము భద్రత కు ఎక్కువ ప్రాధాన్యమిస్తూ టెంట్‌లన్నీ అగ్నినిరోధకంగా, జలనిరోధకంగా చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సర్కస్‌లో ఇథియోపియన్ దయాబోలో స్వింగింగ్ బీమ్ అక్రోబాటిక్, కంటార్షన్, రోలర్ బ్యాలెన్స్‌ని పరిచయం చేస్తున్నామని వీటితో పాటు పలు ప్రదర్శనలు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

## ఉర్దూ మీడియం స్కూల్‌లో మ్యాథ్స్ డే



కొండాపూర్, జనవరి 9 : క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసిస్తూ లక్ష్యాలను చేరుకోవాలని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి అన్నారు. గురువారం ఆమె చందానగర్ వేముకుంట కాలనీలోని ఉర్దూ మీడియం పాఠశాలలో నిర్వహించిన మ్యాథ్స్ డే కార్యక్రమానికి హాజరై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి చినప్పుడే ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోగలరన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరెంట్‌షాక్ తగిలి కార్మికులకు గాయాలు

దుండిగల్, జనవరి 4 : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఇద్దరు కార్మికుల ప్రాణాలమీదికి తెచ్చింది. మరమ్మత్తు పనులు చేస్తుండగానే కరెంట్ ఫీడర్‌ను ఆన్‌చేయడంతో షాక్‌తగిలి కార్మికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం గాజులరామారం చౌరస్తాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... గాజులరామారం చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బాలాజీలేఅవుట్ కమాన్ వద్ద అనిల్, భాను ప్రకాశ్ అనే కాంట్రాక్ట్ కార్మికులు విద్యుత్ తీగలను లాగుతున్నారు. ఇక్కడ మరమ్మత్తు పనులు చేస్తుండగానే గాజులరామారం సబ్‌స్టేషన్‌లో సదరు ఫీడర్‌ను అన్‌చేయగా అనిల్, భాను ప్రకాశ్‌లకు కరెంట్‌షాక్ తగలడంతో కింద పడగా గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే చికిత్స నిమి త్తం బాధితులను స్థానికంగా ఉండే ఓ ఆసుపత్రికి తరలించారు. సబ్‌స్టేషన్ ఏఈ నిర్లక్ష్యం వల్ల నే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా పను లు చేపించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కార్మికుల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఏఈని వివరణ కోరేందుకు యత్నించగా ఆయన స్పందించకపోవడం గమనార్హం.

## రహదారులు పరిశుభ్రంగా ఉండాలి..

### చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న డీసీ మోహన్‌రెడ్డి

మియాపూర్, జనవరి 9: వీధుల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపట్టాలని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధాన రహదారులు సహ అంతర్గత కాలనీ రహదారులు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య పరిస్థితులను మరింతగా మెరుగు పరచాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలో పారిశుధ్య పరిస్థితులపై వైద్యాధికారి డాక్టర్ రవి, ఎస్ఎస్ శ్రీనివాస్ సహ ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలతో డీసీ గురువారం సర్కిల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ప్రతి వాణిజ్య కేంద్రంలో రెండు చెత్త డబ్బాలు విధిగా ఉండేలా పర్యవేక్షించాలని, ఇండ్ల వద్ద తడిపొడి చెత్త వేరువేరుగా సేకరించి యార్డుకు తరలించేలా తగు చర్యలు తీసుకో వాలన్నారు. సర్కిల్ వ్యాప్తంగా జరిగే వారంతపు సంతలను కాలనీకి చెందిన స్వచ్ఛ ఆటోలకు అనుసంధానించి అదే రోజు రాత్రికల్లా వ్యర్థాల తొలగింపు విధిగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని డీసీ ఆదేశించారు. కాలనీల్లో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను పూర్తి స్థాయిలో నిరోధించాలని, ఇందులో కాలనీ సంఘాలను, స్థానికులను భాగస్వాములను చేస్తూ అవగాహనకు కృషి చేయాలన్నారు. నానాటికీ పెరుగుతున్న కాలనీల నేపథ్యంలో ప్రస్తుతం క్షేత్రస్థాయి కార్మికుల సంఖ్య సరిపోవడంలేనందున ఉన్నతాధికారులకు నివేదించి పూర్తిస్థాయికి ఏర్పాటు చేయాలని విన్నవిస్తామన్నారు. స్వచ్ఛ ఆటోలు ఇండ్ల వద్దే వ్యర్థాలను వేరుచేసుకునే డంప్ యార్డుకు వెళ్లాలని డీసీ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రధాన రహదారులను శుభ్రం చేసేందుకు జోనల్ నుంచి స్వీపింగ్ యంత్రం కేటాయింపు అయినందున పరిశుభ్రమైన రహదారులే లక్ష్యంగా పని చేయాలని ఆయన సూచించారు.

## ఓల్డ్ హైదరాబాద్ రోడ్డును పునరుద్ధరించాలి

దుండిగల్, జనవరి 9 : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేట్ నుంచి బాచుపల్లిలోని రెడ్డీస్ ల్యాబ్, ప్రణీత్ ఆంటీలియా వరకు మాస్టర్ ప్లాన్‌లో ఉన్న ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు (విలేజ్ మ్యాప్ ప్రకారం)ను పునరుద్ధరించాలని మల్లంపేట్‌కు చెందిన నేత ఎంబరి ఆంజనేయులు హైడ్రా కార్యాలయంలో గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇటీవల మల్లంపేట్ పరిసర ప్రాంతాల్లో పెరిగిన ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్డు స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని, 100 ఫీట్ల రోడ్డును తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్, దుండిగల్ మున్సిపాలిటీ కమిషనర్‌లకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం గండిమైసమ్మ-దుండిగల్ మండల పరిధిలో ఎక్కువ మొత్తంలో నిర్మాణాలు జరగడం వల్ల ఉద్యోగులు / వ్యాపారులతో పాటు సాధారణ ప్రజలు ప్రతీరోజు మాదాపూర్, కూకట్‌పల్లి, నిజాంపేట్ తదితర ప్రాంతాలకు వెళ్ళడానికి మల్లంపేట రోడ్డు (40ఫీట్లు) చిన్నది కావడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం బాచుపల్లి రెడ్డీస్ ల్యాబ్ స్టేట్ హైవే రోడ్ నుంచి మల్లంపేట కత్వా చెరువు మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు 100 ఫీట్ల రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన నిర్మాణాలను తక్షణమే తొలగించి, రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బాచుపల్లి విలేజ్ రెవెన్యూ మ్యాప్ ప్రకారం ఓల్డ్ హైదరాబాద్ రోడ్డును పునరుద్ధరించాలని కోరారు. కత్వాచెరువులో డ్రైనేజీ వాటర్ చేరకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చెరువులో మురుగునీరు చేరడం వల్ల చేపలు చనిపోతున్నాయని, దీంతో మత్స్యకారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు.

## జగద్గిరిగుట్ట పోచమ్మగుడివద్ద కబ్జా



జగద్గిరిగుట్ట, జనవరి 9 : పేదలపేరుతో జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్ప పరిసరాల్లో కబ్జాలు కొనసాగుతున్నా యి. పోచమ్మగుడి సమీపంలో కొందరు స్థానికనేతల సహకారంతో రేకు ల షెడ్లు నిర్మించారు. ఇదివరకే రహదారి ఇరువైపులా చిన్నపాటి షెడ్లు, గదులు నిర్మించడంతో మున్సిపల్ అధికారులు ప్రహరీ పనులు చేపట్టలేకపోతున్నారు. పండుగ నేపథ్యంలో పదుల సంఖ్యలో ఆక్రమణలు వెలుస్తున్నాయి. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వేంకటేశ్వర ఆలయ నూతన కార్యవర్గం



జగద్గిరిగుట్ట, జనవరి9 : దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని జగద్గిరిగుట్ట వేంటేశ్వర ఆలయం నూతన కార్యవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేసింది. చైర్మన్‌గా నరేందర్‌రెడ్డి, సభ్యులుగా రవీందర్, రాజు, సునీత, శ్రీనివాసచారి, వేణుగౌడ్, బుచ్చిరెడ్డి ఎంపికయ్యారు. అతిథిగా హాజరైన కొలను హన్మంతారెడ్డి వారిని అభినందించి ఆలయ అభివృద్ధికి కృషిచే యాలని సూచించారు.

## ట్రాన్స్‌జెండర్లు ఇబ్బందులు కల్గించవద్దు

మాదాపూర్, జనవరి 9: ట్రాన్స్ జెండర్లు రోడ్లపైన పబ్లిక్, వాహనదారులను ఇబ్బందులకు గురిచేయరాదని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ సూచించారు. ట్రాన్స్‌జెండర్లు ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులకు అంతరాయం కలిగిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో గురువారం ట్రాన్స్‌జెండర్లను పిలిచి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ... ట్రాన్స్‌జెండర్లు వాహనదారులతో, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ప్రజలను, వాహనదారులను రెచ్చగొట్టేలా ప్రవర్తించడం చేయరాదన్నారు. ప్రజలకు, ప్రయాణికులకు రోడ్లపై ట్రాఫిక్‌లో అంతరాయం కలిగించేలా ప్రవర్తించరాదన్నారు. ఈ కార్యక్రమానికి దాదాపుగా 25 మందికి పైగా ట్రాన్స్‌జెండర్లు హాజరయ్యారు.




ట్రాన్స్‌జెండర్లతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్

## గంజాయి తాగుతూ పట్టుబడ్డారు..

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 9 : గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు . కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదర్‌నగర్ అడ్డగుట్ట చౌదరి మెస్ సమీపంలోని టాటూస్ షాప్‌లో గాజులరామారంకు చెందిన కుమ్మరి సాయిప్రకాశ్ , కేపీహెచ్‌బీ కాలనీ వెస్టర్న్‌హిల్స్‌కు చెందిన కావూరి అఖిల్‌లు పనిచేస్తున్నారు. ఈ నెల 6న సాయంత్రం టాటూస్ షాప్‌లో వారిద్దరు గంజా యి సేవిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేయగా .. కుమ్మరి సాయిప్రకాశ్, అఖిల్‌లు గంజాయి తాగుతున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ప్రణయ్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత అదృశ్యం..



చిత్రశ్రీ(ఫైల్)

దుండిగల్, జనవరి 4 : ఓ వివాహి త అదృశ్యమైంది. ఈ సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సూరారంకాలనీలోని ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన జిల్లెల్ల రెడ్డిబాబు, చిత్రశ్రీ (20) దంపతులు. రెడ్డిబాబు డ్రైవర్‌గా చేస్తుండగా, చిత్రశ్రీ గృహిణి. ఈ క్రమంలో గత ఏడాది డిసెంబర్ 20న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిన చిత్రశ్రీ ఇప్పటివరకు తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన భర్త రెడ్డిబాబు.. బంధువులు, స్నేహితుల ఇండ్లలో ఆరాతీసినా ఫలితం దక్కకపోడవంతో సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మాదాపూర్, జనవరి 9: మాదాపూర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో శుక్రవారం రూ. 4 కోట్ల 4 లక్షల 20 వేల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.